క్లుప్తంగా

అనధికార కుళాయిలు తొలగించండి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామం లోని చాకలి వీధిలో అదే వీధికి చెందిన కొంతమంది అనధికారంగా కుళాయిల నుంచి నీటిని ఇళ్లల్లోకి పైపుల ద్వారా మళ్లించడంతో మిగిలిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు మహిళలు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని అదే వీధికి చెందిన కొవ్వూరు పద్మ, అల్లువారి ఇందిరతోపాటుగా పలువురు మహిళలు మంగళవారం సచివాలయం కార్యదర్శి సత్యనారాయణ బిషాలోకు వినతిపత్రాన్ని అందించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్థల పరిశీలన



గొడియపాడు వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

హిరమండలం: మండలానికి మంజూరైన పీఎం జనమన్ వసతి గృహాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను టెక్కలి ఆర్డీఓ బి.సుదర్శనదొర, తహసీల్దార్ బి.వెంకటరమణ, మండల రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సుభలయ ఆర్అండ్ఆర్ కాలనీ, సీడి గ్రామాలకు వసతి గృహాలు మంజూరయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో భూసేకరణ చేసేందుకు ప్రభుత్వ భూమి అందుబాటులో లేదన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీకి సంబంధించి గులుమూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించామన్నారు. సీడికి సంబంధించి గొడియపాడు రెవెన్యూ పరిధిలో సుమారు ఎకరా ప్రభుత్వ భూమిని సేకరించామన్నారు. స్థల సేకరణ పూర్తిచేసినట్లుగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న హరిసత్యం

సారవకోట: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బుడితి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిక్కు హరిసత్యం కోరారు. మండలంలోని బుడితి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సారవకోట, జలుమూరు మండలాల విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్నిమంగళవారం నిర్వహించారు. కొత్తగా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 68 మందికి పరీక్షలు నిర్వహించారు. 21 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పాటోజు శివాజీ తదితరులు పాల్గొన్నారు.


ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏఓ సునీత

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్కు సంబంధించి ఈ–పంట నమోదు జరుగుతుందని, రైతులు వేసిన పంట నమోదు ధ్రువీకరణ కావాలంటే విధిగా వేలిముద్రలు వేయాలని నరసన్నపేట ఏఓ కె.సునీత తెలిపారు. యారబాడు రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ–పంట నమోదు, ఈకేవైసీ ధ్రువీకరణపై మంగళవారం సమీక్ష చేపట్టారు. వేలిముద్రలు వేస్తే లింక్ అయిన ఫోన్కు ఓటీపీ వస్తుందని, దానిని నమోదు చేస్తే ఈకేవైసీ పూర్తి అవుతుందన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి ఈ–పంట నమోదు, ఈకేవైసీ పూర్తవుతుందన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలతో చిన్నారులు

సారవకోట: మండలంలోని అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఈ పాఠశాల తరఫున మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయించారు.

నియమ, నిష్ఠలతో..

వినాయక ఉత్సవాలు



విగ్రహాలకు రంగులు అద్దుతున్న తయారీదారుడు

- నిబంధనలు పాటించాలి
- మండపాలకు ముందస్తుగా అనుమతులు అవసరం
- ఘర్షణలకు తావులేకుండా ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాలి



వినాయక వేడుకలకు సిద్ధం చేసిన మండపం

సరుబుజ్జిలి: గణనాథుని నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించువాలని పోలీస్ అధికారులు స్పష్టంచేశారు. ఈ పండగను భక్తులు ఆధ్యాత్మిక భావనతో పాటు నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమైయ్యే వినాయక చవితి వేడుకల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. అవగాహన పెంచుకుంటే శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగదని గుర్తుచేస్తున్నారు. మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణల విషయంలో సంబంధితశాఖ అనుమతులు, సూచనలు పాటిస్తే అపశృతులకు తావుండదని ఇరుశాఖల అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు ఇలా....

- విగ్రహ ఏర్పాటుకు కమిటీలు తప్పనిసరిగా ముందస్తుగా పోలీసుల అనుమతులు పొందాలి.
- వివాదస్పద స్థలాలు, ట్రాఫిక్కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేయకూడదు.
- విగ్రహాలు, మండపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ బాక్సులు, మైక్సెట్లకు అనుమతులు తప్పనిసరి.
- మితిమీరిన సౌండ్ నిషిద్ధం. ఉత్సవాల్లో భాగంగా అశ్లీల నృత్య ప్రదర్శనలు చేయరాదు. మత్తు పానియాలు సేవించరాదు.
- విద్యుత్శాఖ అధికారుల అనుమతులతో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు శాఖాపరమైన అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి. విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో అనేక అనర్థాలు పొంచి ఉంటాయని గుర్తించాలి.
- ఎటువంట అవాంఛనీయ ఘటనలకు తావిత్వకుండా ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- ఉత్సవ నిర్వహణకు సంబంధించి బలవంతపు చందాలు, వసూళ్లకు పాల్పడరాదు. ఇలా చేస్తే చట్టరీత్యా నేరం.
- మసీదులు, చర్చీల సమీపంలో మండపాలను ఏర్పాటుచేసే వారు నమాజ్, ప్రార్థనలు జరిగే ప్రత్యేక సమయంలో వారికి సహకరించే విధంగా సౌండ్ సిస్టమ్లను పూర్తిగా ఆపుచేయాలి.
- అనుమానిత వ్యక్తులను, ఏదైనా సందేహాలు మండపాల వద్ద గుర్తిస్తే తక్షణమే పోలీసులకు తెలియజేయాలి.
- రాత్రి 10 గంటల తరువాత మండపాల వద్ద కార్యక్రమాలను బంద్ చేయాలి. మైక్ సెట్లను ఆపివేయాలి.
- విగ్రహాల నిమర్జన సమయంలో నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పాటించటం, పోలీసుల సహకారం తీసుకోవాలి.
- వీలైనంత మేరకు నిమర్జనాలు రాత్రి 9 గంటల లోపు పూర్తిచేయాలి. బాణసంచా వాడకం సరికాదు.
- మండపాలు ఏర్పాటుచేసేందుకు నిబంధనలు పాటిస్తామని లిఖితపూర్వకంగా నిర్వాహకులు స్పష్టం చేయాల్సి ఉంటుంది.
- విగ్రహ ప్రతిష్ఠలు ఎక్కడ ఏర్పాటు చేస్తారు, ఎప్పుడు నిమర్జనం చేపడతారనే వివరాలు అనుమతులు పొందు సమయంలో పేర్కొనాల్సి ఉంటుంది.

సింగిల్ విండో విధానంలో అనుమతులు



వినాయక ఉత్సవాల అన్నిరకాల అనుమతుల కోసం ప్రభుత్వం సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావిత్వకూడదు. ముఖ్యంగా అధికారులు సూచిస్తున్న నిబంధనలు ఉత్సవ కమిటీ సభ్యులు పాటించాలి. ఇప్పటికే అన్ని స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వటం జరిగింది. ఇతరులకు ఇబ్బందులు లేకుండా వేడుకలు చేపట్టాలి.

– పి.సత్యనారాయణ, సీఐ, ఆమదాలవలస

మండపాల భద్రత ముఖ్యం

మండపాల వద్ద వచ్చే భక్తులు విద్యుత్, ఇతర ప్రమాదాలకు గురికుండా కమిటీ సభ్యుల బాధ్యత తీసుకోవాలి. ముందస్తుగా మాశాఖను సంప్రదిస్తే విద్యుత్ సరఫరా ఏర్పాట్లకు అనుమతులు ఇస్తాం. విద్యుత్ చౌర్యాని పాల్పడి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు.

– పి.అప్పలనాయుడు, ట్రాన్స్కో ఏఈ, సరుబుజ్జిలి

శ్రమదానం



కొత్తూరు: మండలంలోని అబలాసింగి రోడ్డు అధ్వానంగా తయారుకావడంతో గిరిజనులు మంగళవారం బాగు చేసుకున్నారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డులో రాళ్లు తేలి గోతులు ఏర్పడ్డాయి. పలు గ్రామాలకు చెందిన గిరిజనులందరూ కలిసి రోడ్డును తాత్కాలికంగా బాగు చేసుకున్నారు. రోడ్డును బాగుచేయాలని అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో రోడ్డును బాగు చేసుకున్నామన్నారు.

రోడ్డును బాగుచేస్తున్న గిరిజనలు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



సరుబుజ్జిలి: మురుగు కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు



ఎల్.ఎన్.పేట: రోడ్డు పక్కనున్న చెత్త తొలగింపు



కొత్తూరు: దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న కార్మికుడు

సరుబుజ్జిలి: మండలంలోని రావివలస గ్రామంలో సర్పంచ్ వండాన కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురుగు కాలువల్లో ఉన్న చెత్తను తొలగించారు. బోర్లు, నేలబావుల వద్ద ఈగలు, దోమలు చేరకుండా క్లోరినేషన్ చేయించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రం నుంచి లక్ష్మీనర్సుపేట గ్రామానికి వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు చేపట్టామని ఎంపీడీఓ కాశీప్రసాద్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో సేకరించిన చెత్తను తీసుకువెళ్లి ఆర్అండ్బీ రోడ్డు పక్కన వేయటం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించిన వెంటనే చెత్తను తొలగించటం జరిగిందన్నారు. ఇకపైన రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు చెత్త వేయవద్దని ఆదేశాలు ఇచ్చామన్నారు.

కొత్తూరు: మండల కేంద్రంలో అన్ని వీధుల్లో సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం క్లోరినేషన్ చేయించారు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున అంటు రోగాలు ప్రబలకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

చీకటిలో అంతర్ రాష్ట్ర చెక్పోస్ట్!

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అంతర్ రాష్ట్ర చెక్పోస్ట్ వద్ద గత రెండు రోజులుగా విద్యుత్ బల్బులు వెలగడం లేదు. ఒడిశా నుంచి వచ్చే వాహనాలు, ఆంధ్ర నుంచి వెళ్లే వాహనాల నంబర్ల సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపించడం లేదు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ కావడంతో మద్యం, ఇసుక, ఇతర నిషేధిత పదార్థాలు రవాణా అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.



చెక్పోస్ట్ వద్ద వెలగని లైట్లు

సామాజిక అంశాలపై శ్రద్ధ చూపాలి

ఆమదాలవలస: మహిళా సంఘాల సభ్యులు సామాజిక అంశాలపై కూడా శ్రద్ధ చూపాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. పొన్నాంపేటలో మంగళవారం గ్రామ సంఘం పాలకవర్గ సమావేం నిర్వహించారు. మహిళా సంఘాలు సమావేశాల నిర్వహణ, పొదుపు చేయడం, అవసరం మేరకు అప్పు తీసుకుని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, పారదర్శకంగా పుస్తక నిర్వహణతోపాటు సామాజిక అంశాలపై ఎక్కువగా శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ సంఘం లీడర్లు కె.మీణ, జి.భవాని, వీఓఏ గాయత్రి, క్లస్టర్ కో ఆర్డినేటర్ రామప్పడు, మహిళా రైతు సంఘాల ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

పరిమితికి మించితే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: స్కూల్ ఆటోలు, మినీ వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఇష్టానుసారంగా విద్యార్థులను కుక్కుతున్నారన్నారు. అనుమతి మేరకే విద్యార్థులను ఎక్కించాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవొద్దని అన్నారు. బైక్లు నడిపి మైనర్లు ప్రమాదాలకు గురైతే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చట్టాలపై అవగాహన

జలుమూరు: విద్యార్థిద దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని జలుమూరు కేజీవీఎస్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వేణుగోపాలరావు అన్నారు. నిజ జీవితంలో చట్టాలు–ఆవశ్యకత, ప్రాధాన్యతలు అనే అంశంపై మంగళవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రాథమిక హక్కులు, బాలికా చట్టాలను వివరించారు. ఉపాధ్యాయులు ఎన్.వాసంతి, నీలవేణి, రాధిక, సుశీల, ఉజ్వల, ప్రభావతి, శ్రీదేవి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

మెళియాపుట్టి: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పరిశుభ్రతపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయలంలో ఎంపీడీఓ, కార్యదర్శులతో మంగళవారం సమీక్షించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్ర వాతావరణం నెలకొల్పాలన్నారు. ఉపాధి హామీ సాంకేతిక సహాయకులతో సమీక్షించారు. గృహనిర్మాణాలకు సంబంధించి 90 రోజుల పనిదినాల కల్పించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ హనుమంతరావు, మండల పరిషత్ ఏఓ తిరుపతి పట్నాయక్, గృహనిర్మాణశాఖ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.

పరామర్శ



బొని గిరిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని సీది సర్పంచ్ బొని పార్వతీ కుమారుడు, వైఎస్సార్సీపీ నాయకుడు బొని గిరి ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం సర్పంచ్ ఇంటికి వెళ్లి ప్రమాదానికి గల కారణలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, నాయకులు ఎనుగుతల సూర్యం, గొకవలస రాము, బి.నారాయణమూర్తి, ఎం.రామరావు, పనుకు మోహన్, మద్ది నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నదీతీర గ్రామాల్లో అప్రమత్తం



మిరియాపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్కుమార్

ఎల్.ఎన్.పేట: వంశధార నదీతీర గ్రామాల ప్రజలు మరో వారం, పది రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, గ్రామీణ పేదరిక నిర్మూలన అధికారి ఎం.కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, తురకపేట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్నారు. తీర గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాలు కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నిత్యావసర సరుకులు, గ్యాస్ వంటివి సిద్ధం చేసుకోవాలన్నారు. వరదల నుంచి సురక్షిత ప్రాంతాలుగా లక్ష్మీనర్సుపేట గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, కెజీబీవీలను వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, పంచాయతీ కార్యదర్శి జయమోహన్ పాడి, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుర్చీలు, పుస్తకాల వితరణ



పుస్తకాలు, కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో ఉన్న సరస్వతి గ్రంథాలయానికి పాతపట్నం గ్రామానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు పుస్తకాలు, నాలుగు కుర్చీలు, క్యారమ్ బోర్డులను మంగళవారం అందించారు. ట్రస్ట్ సభ్యుడు, రిటైర్డ్ ఎంఈఓ కె.త్రినాథరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అతని జ్ఞాపకార్థం ఈ సామగ్రిని అందజేశామని తెలిపారు. అంపోలు మధు, జి.సంజీవరావు, రెడ్డి వెంకటరావు, బర్రి ఉమ, సన్యాసిరావు, మన్మథరావు, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోరును బాగుచేసేదెప్పుడు?

సారవకోట: మండలంలోని అలుదు పెద్ద వీధిలో మంచినీటి బోరుకు హెడ్ బిగించకపోవడంతో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బోరు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా హెడ్ బిగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదీకాక ఇక్కడున్న మంచినీటి పథకం మోటార్కు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు కోసేశారు. బోరుకు హెడ్ బిగించక పోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హెడ్ బిగించని బోరు

నిందితులను కఠినంగా శిక్షించాలి



హిరమండలం: నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు



కొత్తూరు: కురిగాం పీహెచ్సీ వద్ద నిరసన తెలియజేస్తున్న ఆశ వర్కర్లు

హిరమండలం: కోల్కత్తాలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ ఆశ వర్కర్ల యూనియన్ సభ్యులు కోరారు. స్థానిక పీహెచ్సీ ఆవరణంలో ఆశ వర్కర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు కె.జ్యోతి, పూర్ణిమ, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే డాక్టర్లకే ప్రాణరక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి మహిళలను రక్షించాలని కోరారు.

కొత్తూరు: మండలంలోని కురిగాం పీహెచ్సీ వద్ద మంగళవారం ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ మండల నాయకురాలు గౌరమ్మ మాట్లాడారు. కోల్కత్తాలో జూనియర్ డాక్టర్పై అఘాయిత్యానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలన్నారు. సంఘం నాయకులు జయమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు

కల్వర్టును తెరిపించాలి

కొత్తూరు: మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డులో అక్రమంగా మూసివేసిన కల్వర్టును తెరిపించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. కొత్తూరులో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ఆర్అండ్బీ (ఆలికాం–బత్తిలి రోడ్డు) కల్వర్టును అక్రమంగా మూసివేయడంతో మురుగునీరు రోడ్డు పైనుంచి ఎస్సీ బాలుర వసతి గృహంలోకి వెళ్తోందన్నారు. వసతి గృహాన్ని మరో భవనంలోకి మార్చడం జరిగిందన్నారు.

కొంతమంది అధికార పార్టీ నేతలు అడ్డుకోవడంతోనే అధికారులు కల్వర్టును తెరిపించ లేకపోతున్నారన్నారు. సీపీఎం నాయకులు నిమ్మక అప్పన్న, సింహాచలం పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా ఏపీడీ పి.రాధ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని చెరువులు, కాలువులు, గెడ్డ గట్టులతోపాటు రోడ్డులకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఆసక్తి చూపించే రైతులను గుర్తించి వారి సొంత స్థలాల్లో పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రోత్సహించాలన్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి వంద రోజులు పనికల్పించటమే లక్ష్యంగా పనులు చేపట్టాలన్నారు. ఏపీఓ వి శ్రీదేవి, సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

యిందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన శ్రీకాకుళం జిల్లా, L.N.పేట మండలం, శ్రీనివాసనగర్ గ్రామం, నారం నాదు రామకృష్ణ, S/o. ముఖలింగం (లేటు) ఇచ్చిన భోగట్టా పై యావన్మందికి తెలియజేయునది. నా క్లయింట్ శ్రీకాకుళం జిల్లా, L.N.పేట మండలం, శ్రీనివాసనగర్ గ్రామంలో ఇంటి వద్ద నుండి L.N.పేట గ్రామానికి తేది.25.08.2024దిన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా DOC No. 1599/1991 నెంబరు గల ఆస్తి పత్రాలు మార్గ మధ్యంలో చేజారిపోయినవి. పత్రాలు పోగొట్టుకున్న విషయం తేది.30.08.2024దిన సరుబుజ్జిలి పోలీస్స్టేషన్కు ఫిర్యాదు చేయగా వారు తేది.02.09.2024దిన NOT TRACED CERTIFICATE ఇచ్చియున్నారు. కావున పై దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేసి అందివ్వగలరు. అందుకు తగిన పారితోషకం ఇప్పించును. డోర్.నెం.1-61, తురకపేట సెంటర్, శ్రీనివాసనగర్, L.N.పేట మండలం, శ్రీకాకుళం జిల్లా. సెల్: 9491807525.

తేది: 03.09.2024
ఆమదాలవలస

సం/- టి.అన్నంనాయుడు, అడ్వకేట్
కొర్లకోట, ఆమదాలవలస మండలం,
శ్రీకాకుళం జిల్లా. సెల్: 9948045722